ప్రమాణమే లక్ష్యం.. ఫొటోనే సాక్ష్యం

- స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రతిజ్ఞ చేసి వెళ్లిపోయిన అధికారగణం
- చెత్తబుట్టల ముందు నిల్చుని ఫొటోషూట్‌లతోనే సరి
- ప్రతి నెలా మూడో శనివారం తుతూమంత్రంగా స్వచ్ఛాంధ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న మార్కెట్ కమిటీ ఉద్యోగులు, సిబ్బంది



పట్టణంలోని సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రమాణాలు, ప్రతిజ్ఞలకే పరిమితమైంది. రెండు నెలల నుంచి ప్రతి మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఆయా సచివాలయాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపడుతున్నారు. గృహాల్లోని తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి ప్రభుత్వం అందించిన చెత్తబుట్టల్లో రంగులను బట్టి సెగ్రిగేషన్ చేపట్టాలి. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పట్టణంలో పారిశుధ్య పనులు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. కానీ ఇది ప్రజల్లోకి వెళ్లడం లేదు. అధికారులు సైతం ప్లాస్టిక్ బుట్టలను ముందుంచుకొని వెనుక బ్యానర్‌తో ఫొటోలు దిగి ప్రతిజ్ఞ, ప్రమాణాలతో ముగించేస్తున్నారు.

ఏదో చేశాం

మున్సిపాలిటీలోని 26 సచివాలయాల్లో శనివారం ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని మున్సిపల్ అధికారులు ముందుగానే హెచ్చరించారు. కానీ శనివారం ఆయా సచివాలయాల వద్ద ఈ కార్యక్రమాన్ని తూతూమంత్రంగానే నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలచే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆయా అధికారులు ప్లాస్టిక్ బిన్లను ముందుంచుకొని వెనుక బ్యానర్ కనిపించేలా సిబ్బందితో కలిసి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. మెప్మా ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులతో మానవహారం, ర్యాలి చేశారు. ఇవన్నీ పక్కన బెడితే ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన ఎంతవరకు చేశామనేది అధికారులు ఓ సారి ఆలోచించాల్సి ఉంది.

పట్టించుకోని మహిళలు

ఇళ్లలో ఉత్పత్తి అయ్యే రోజువారీ వ్యర్థాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి సూచించిన ప్లాస్టిక్ బుట్లలో వేసి అందించాలి. కానీ చాలా మంది మహిళలు మొత్తం చెత్తను తెచ్చి చెత్తకుండీలోనో లేదా చెత్తబండిలో పడేస్తున్నారు. మరికొందరు మున్సిపల్ అధికారులు పంపిణీ చేసిన ప్లాస్టిక్ బుట్టల్లో నీరు నింపి వాడుకుంటున్నారు. దీనిపై పట్టణంలోని మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే నెలకోసారి స్వచ్ఛదిన్ పెడితే సరిపోదు. నిరంతరం పట్టణంలో చెత్తసేకరణ ప్రక్రియను పర్యవేక్షించి, దీన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాటి శ్రద్ధ ఏదీ?

పట్టణంలో పారిశుధ్యంపై గతంలో ఇక్కడి మున్సిపల్ కమిషనర్లు చూపిన చొరవ ఇప్పుడు లేదనే మాట పట్టణవాసుల్లో వినిపిస్తోంది. అప్పట్లో కమిషనర్ ఉదయం ఐదుగంటలకే వీధుల్లో పర్యవేక్షిస్తూ సూర్యుడు ఉదయించేలోపు పట్టణంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేవారు. దీంతో పలమనేరు మున్సిపాలిటీ గ్రీన్‌లీఫ్ అవార్డును సైతం పొందింది. కానీ నేడు పది గంటలు కాదు 12 గంటలకు కూడా పారిశుధ్య సిబ్బంది వీధుల్లో చెత్తను తీస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల చెత్త పేరుకుపోయిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే కానీ ఆ చెత్తను తీయడం లేదు.







వి.కోట : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త వనలక్ష్మి, గంగవరం: ఆస్పత్రి ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది, సదుం: స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శుభ్రత అందరి బాధ్యత

సదుం: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ హరిబాబు సూచించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు హుస్సేన్, హెచ్ఎం జయకుమార్ రెడ్డి, విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో డాక్టర్ పుష్పకుమారి, చెరుకువారిపల్లె పీహెచ్‌సీలో డాక్టరు గిరీషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి హసీనా, నాగేషారెడ్డి, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ పీహెచ్‌సీలో..

గంగవరం: మండలంలోని పత్తికొండ పీహెచ్‌సీలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమాన్ని వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పార్లే జి ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో అందించిన పలు రకాల మొక్కలను ఆస్పత్రి ప్రాంగణంలో నాటారు. నెలలో ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమం తప్పకుండా నిర్వహిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.

మహిళలకు అవగాహన

వి.కోట: మండలంలోని పాపేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త వనలక్ష్మి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై బాలింతలకు, మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

రొంపిచెర్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి చెత్తను ఆరోగ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి,సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

కుప్పం: పట్టణం బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయి మాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకరనేత్రాలయ కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కంటి రోగులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు.

500 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: పట్టణంలో పలు సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు శనివారం దాదాపు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ సంస్థ సభ్యుల జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా 15వ తేదీ పట్టణంలోని కేజీఎఫ్ బస్టాండు వద్ద అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తమీమ్‌ఖాన్, గిరిధర్, సురేంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కుప్పం విద్యార్థి ప్రతిభ



జాహ్నవి

కుప్పంరూరల్: జేఈఈ మెయిన్స్‌లో కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కమతమూరు గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం కుమార్తె జాహ్నవి జేఈఈ మెయిన్స్‌లో 82% పర్సంటైల్ స్కోరు సాధించినట్లు బీసీ ఎన్ కళాశాలల చైర్‌పర్సన్ శాంతానాగరాజు తెలిపారు. మొదటి నుంచి కుప్పం పబ్లిక్ స్కూల్లో విద్యాభ్యాసం సాగించిన జాహ్నవికి ర్యాంకు రావడంపై పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చల్లావారిపల్లిలో కార్డన్ సెర్చ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సహదేవి

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ చల్లావారిపల్లి గ్రామంలో శనివారం ఎస్‌ఐ సహదేవి ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల వివరాలను సేకరించారు. రికార్డులు లేని 5 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు కలిగి ఉండాలని, హెల్మెట్ పెట్టుకుని వాహనాల్లో నడపాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

బైరెడ్డిపల్లె : గంగజాతర సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వాలీబాల్ క్రీడాకారులు 25 జట్ల వరకు ఈ పోటీల్లో తలపడుతున్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వాలీబాల్ పోటీలను తిలకిస్తున్నారు. పూర్వ విద్యార్థులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుంగనూరు: కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పుంగనూరు పట్టణం ప్రకాశం కాలనీలో నివాసం ఉన్న బాలాజి, మోహన్ శనివారం సాయంత్రం కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్నారని సీఐ శ్రీనివాసులుకు సమాచారం అందింది. వెంటనే సీఐ తన సిబ్బందితో పుంగనూరు-ముళబాగల్ మార్గంలోని కట్టపై నిఘా ఉంచి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 143 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతర వైభవం



ఊరేగుతున్న బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని బాట గంగమ్మ జాతర వైభవంగా సాగింది. అమ్మవారి శిరస్సును శనివారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం శిరస్సును ఊరేగించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం.. పరిపూర్ణం



శాంతి ఉత్సవంలో ఊరేగుతున్న శ్రీ వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్వాదశి హారతులతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకాలు చేసి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి పట్టణానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ దవనం భక్తవత్సలం ఆధ్వర్యంలో స్వామి వారికి ద్వాదశి హారతులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మండలంలోని పొంతనపల్లెకు చెందిన చిన్నప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివార్లను శాంతి ఉత్సవంపై కొలువుదీర్చి పుర వీధుల్లో ఊరేగించారు. దీనికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అడుగడుగునా హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు



సంత్‌సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్ట గ్రామంలో మహరాజ్ సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణం నుంచి సుగాలిమిట్ట గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. కమిటీ సభ్యులు ఈశ్వర్‌నాయక్, రెడ్డినాయక్, భానుప్రసాద్, రామయ్య ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండలంలోని 8 తాండాలలో పేదలకు అన్నదానం చేశారు. బంజార కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మునీంద్రనాయక్, రాజునాయక్, శ్రీరాములునాయక్, రెడ్డినాయక్, మునినాయక్, ప్రభాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొత్తకోటలో చిరుత సంచారం?

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోటలో చిరుత పులి సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు శనివారం గుర్తించారు. ఏ.కొత్తకోట నుంచి అగస్త్యేశ్వరస్వామి అలయం వద్దకు వెళ్లే మార్గంలో చిరుత సంచరించినట్లు ఆనవాళ్లు ఉన్నాయని తెలిపారు. అటువైపు వెళ్లేందుకు రైతులు, ప్రజలు భయపడుతున్నారని పశువుల కాపరులు వివరించారు. సంబంధిత అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు దొనపల్లెకు చెందిన వెంకటరమణ ఇంటి ముందు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద గల 15 క్వార్టర్ బాటిళ్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి పుంగనూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

అంబేడ్కర్ భవనాన్ని పునర్నిర్మించాలని వినతి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుప్పం: మండలంలోని సామగుట్టపల్లె వద్ద నిర్మించిన దళిత భవనాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని దళిత నాయకులు కడా పీడీ వికాస్ మర్మత్‌కు వినతి పత్రం అందించారు. గతంలో 0.40 సెంట్ల భూమి కొనుగోలు చేసి దళిత భవనాన్ని నిర్మించారని చెప్పారు. దీనిపై పర్యవేక్షణ లేకపోవడంతో అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరిందని దళిత నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

జూదరుల అరెస్టు

పుంగనూరు : మండలంలోని భీమగానిపల్లి సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సమాచారం మేరకు కోడి పందాలు నిర్వహిస్తున్న ముగ్గురిని పట్టుకుని, కోళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించామన్నారు. కోర్టు జరిమానా విధించినట్లు తెలిపారు.

జనం నిలదీయడం ఖాయం



సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ఎన్నికల సమయంలో లేనిపోని హామీలను గుప్పించిన కూటమి నేతలను త్వరలో జనం నిలదీయడం ఖాయమని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో షరతులతో కూడిన బెయిల్‌పై శనివారం ఆయన సంతకం చేసి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేతలతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే జనాగ్రహానికి కూటమి ప్రభుత్వం కొట్టుకుపోవడం తథ్యమన్నారు. జగనన్న పాలనలో తీసుకొచ్చిన వ్యవస్థలను ఈ ప్రభుత్వం పనిగట్టుకుని నాశనం చేస్తోందని ఆరోపించారు. నాడు సర్కారు బడుల్లో పిల్లల పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకపోయినా తాము ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డా.సునీల్, నాయకులు మండీసుధా, మురళీకృష్ణ, బాలాజీ నాయుడు, దయానందగౌడ, రాజారెడ్డి, శ్రీరాములు రెడ్డి, కౌన్సిలర్లు రహీంఖాన్, శ్యామ్, శ్యామ్ సుందర్ రాజ్, కమాల్, నాగరాజు, హైదర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య మరింత బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో లీలారాణి

పలమనేరు: ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవో లీలారాణి సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రైమరీ లెవల్, సబ్జెక్ట్ లెవల్ సమావేశాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సీఆర్పీ సమావేశాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఆమె మట్లాడుతూ వీటి ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్య అందాలని సూచించారు. పిల్లల అభ్యసనా సమర్థత, ప్రోగ్రెస్ కార్డులు, బాగా చదవలేని పిల్లలపై తీసుకున్న ప్రత్యేక చొరవ, బడి ప్రగతి నివేదికలపై విపులంగా మాట్లాడారు. ఇందులో హెచ్ఎంలు షంషీర్, లతా, నోడల్ అధికారి బాలసుందరం, నేతాజి, గణపతి, ఈశ్వరప్రసాద్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీలను నిర్లక్ష్యం చేస్తే సహించం



మాట్లాడుతున్న అశోక్

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని రాష్ట్ర మాలమహానాడు కార్యదర్శి ఎన్ఆర్.అశోక్ హెచ్చరించారు. ఆయన శనివారం మాలమహానాడు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని, తూతూమంత్రంగా అధికారులు హాజరవుతున్నారని మండిపడ్డారు. పట్టణంలో ఫైనాన్స్ కంపెనీల వేధింపులతో ఎస్సీ, ఎస్టీలు బలవుతున్నారని చెప్పారు. ఈ విషయమై కమిటీలో ఫిర్యాదు చేసినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలపై అధికారులు స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రెడ్డి, నాగరాజ, మంజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

- మండల మీట్లో జెడ్పీటీసీ సభ్యుడి ఆగ్రహం
- ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వలేదంటూ ఆవేదన



మండల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ దామోదరరాజు

చౌడేపల్లె: ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వని ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు ఎన్. దామోదరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రామమూర్తి అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. అందులో జెడ్పీటీసీ మాట్లాడుతూ, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీకి ఇవ్వాల్సిన సర్క్యులర్ (ఆహ్వాన ప్రతి)ను గ్రీన్ అంబాసిడర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర గ్రామస్థాయి సిబ్బందితో పంపిస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అధికారులు పంపిన సర్క్యులర్‌ను చూపించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని జెడ్పీటీసీ తెలిపారు. మండల మీట్ 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా సుమారు గంటన్నర సేపు తరువాత ఆలస్యంగా ప్రారంభమైంది. సర్క్యులర్ జారీ విషయమై ఎంపీటీసీలు సమావేశానికి రావడానికి ఆసక్తి చూపకపోవడంతో ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి ఎంపీటీసీలకు ఫోన్లు చేసి రప్పించారు. అయినప్పటికీ ఐదుగురు ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబరు రాలేదు. ప్రజాప్రతినిధుల పట్ల కనీస గౌరవం పాటించకుంటే ఎలా అంటూ మండిపడ్డారు. ఎంపీడీఓ లీలామాధవి మాట్లాడుతూ ఇక మీదట సర్క్యులర్లను పోస్టు ద్వారా పంపుతామని సభ్యుల సలహాలు పాటిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో చేపట్టిన నాడు-నేడు పనులు అర్థంతరంగా ఆగిపోయాయని వీటిని పూర్తిచేయాలని జెడ్పీటీసీ కోరారు. వ్యవసాయం చేసే రైతులు కొత్త బోరు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినా సకాలంలో ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్టారెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి, సూపరింటెండెంట్ షబ్బీర్ అహమ్మద్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందేలా చూడండి

రేషన్ షాపుల్లో ప్రతి కార్డుదారునికి బియ్యంతోపాటు చెక్కర, కందిపప్పులు అందేలా చూడాలని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి అధికారులను నిలదీశారు. మండల సమావేశంలో వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రేషన్ షాపుల్లో కార్డుదారులందరికీ చెక్కెర, పప్పులు ఇవ్వడంలేదని, ముందువెళ్లిన వారికి మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. మిగిలిన కార్డుదారులకు ఇవ్వకుంటే ఎలా అంటూ ప్రశ్నించారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. వరి పంట సాగుచేసిన రైతులకు యూరియా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేదన్నారు. అధిక ధరలిచ్చి దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేశారని చెప్పారు. మండల కేంద్రంలో గృహాలపై వెళ్లిన విద్యుత్ లైన్లు మార్చాల్సి ఉందని ఏఈ శశిధర్ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కృష్టారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.